క్లుప్తంగా

వినతిపత్రం అందజేత

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల సర్వేనెంబర్ 24, 27,28, 31,35,58, 59, 60లలో వచ్చిన లేఅవుట్‌లోని 226 గజాలు, 770 గజాల పార్కుల స్థలాలను గతంలో రియల్టర్ గ్రామపంచాయతీకి రిజిస్ట్రేషన్ చేశారని వాటిని పరిరక్షించాలని మంచిరేవుల ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీపీఎం పార్టీ నాయకుడు రుద్రకుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసిన స్థానిక నేతలు

శంషాబాద్/బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీ ములుగు నుంచి ప్రారంభించే 'హాత్ సే హాత్ జోడో యాత్ర' సన్నాహక సమావేశం గాంధీభవన్‌లో జరిగింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌తో పాటు శంషాబాద్ పట్టణ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి ఈనెల 6 నుంచిప్రారంభమయ్యే 'హాత్ సే హాత్ జోడో యాత్ర' విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వారికి సూచించారు. పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, ధనుంజయ్, ఖలీద్ తదితరులున్నారు.

ముగిసిన శృతి-2023 ఉత్సవాలు

మణికొండ: సీబీఐటీ వార్షికోత్సవ సందడి శృతి-2023 ముగింపు ఉత్సవాలు విద్యార్థుల ఆటపాటలతో ముగిశాయి. ఈ ఉత్సవాల ముగింపు రోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పోటీపడ్డారు. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి, టీఎస్‌టీఎస్‌సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి, సినీ డైరెక్టర్ వైవీఎస్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో రాణించాలంటే ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని వాటి సాధనకు విద్యార్థి దశలోనే సరైన వేదికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, శృతి చైర్మన్ పీవీఆర్ రవీందర్‌రెడ్డి, కో- చైర్మన్ కృష్ణారెడ్డి, కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో ఫ్లై ఓవర్ సమస్యకు పరిష్కారం

- హామీ ఇచ్చిన చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి
- దీక్ష విరమించిన శంషాబాద్ జేఏసీ నేతలు


స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్‌ముదిరాజ్ చేత దీక్ష విరమింపజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

శంషాబాద్: రెండు నెలలో ఫ్లైఓవర్ సమస్య పరిష్కారమవుతుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి శంషాబాద్ జేఏసీ నేతలకు హామీ ఇచ్చారు. శనివారం రిలే దీక్షలు చేపడుతున్న ప్రాంతాన్ని నేషనల్ హైవే అథారిటీ, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలకు సంఘీభావం తెలిపిన ఆయన అనంతరం ఎంపీ మాట్లాడారు. ఫ్లైఓవర్ ర్యాంపు సిద్ధంతి వద్ద దిగుతుండటంతో ఎదురయ్యే సమస్యలను అధికారులకు అర్థమైందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఉన్న రెండు పరిష్కారాల్లో ఒకటి సాధ్యం అయ్యేందుకు అవకాశం ఉందన్నారు.

- స్థల సేకరణ లేకుండా మరో ఫ్లైఓవర్ అత్యంత సమీపంలో ప్రారంభించేందుకు సాంకేతికంగా అవకాశాలు ఉన్నాయన్నారు.
- ప్రస్తుతం ఫ్లైఓవర్ ముగిసిన తర్వాత కొంత దూరానికి మరో ఫ్లైఓవర్ నిర్మాణంతో పాటు వెహికల్ అండర్ పాస్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు.
- ఈ ప్రక్రియ టెండర్ వేయించేందుకు మరో రెండు నెలల సమయం పడుతుందని దీనిపై తాను ఢిల్లీ వెళ్లి దగ్గరుండి పరిష్కరించేందుకు పూర్తి స్థాయి కృషి చేస్తానన్నారు.
- హామీ నెరవేరకపోతే మరోసారి మీతోనే కలిసి దీక్షల్లో పాలుపంచుకుంటానని ఆయన చెప్పినట్టు సమాచారం.
- రహదారులపై ప్రమాదాలు నివారించేందుకు ఫ్లైఓవర్‌లు, విస్తరణ పనులు చేపడుతున్నారని అలాంటి ప్రమాదాలకు కారణంగా మారుతున్న చోట తక్షణ పరిష్కారాన్ని ప్రభుత్వం తప్పకుండా పరిష్కార మార్గం తీసుకుంటుందన్నారు.

దీక్షల విరమణ..

- ఎంపీ రంజిత్‌రెడ్డి హామీ మేరకు రిలే దీక్షలు చేపడుతున్న నేతలు దీక్షను విరమించారు. జేఏసీ ముందుండి నడిపించిన స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్‌ముదిరాజ్‌కు ఎంపీ నిమ్మరసం అందజేసి విరమింపజేశారు. ×నేషనల్ హైవే అథారిటీ ప్రాంతీయ అధికారి కుశ్వహా, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ గణేష్‌గుప్తా, జేఏసీనేతలు పాల్గొన్నారు.

బీఎంఎస్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



శంషాబాద్: రవాణా రంగంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్‌సంఘ్ ఈ నెల 14న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు బీఎంఎస్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రవాణా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సమీక్షించాలన్నారు. సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో కూడా ఉద్యమించనున్నట్లు పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు చింతల నందకిశోర్ గుప్తా, శంకర్, సయ్యద్, రవి, దర్శన్, లడ్డు, పరుశురాం, సంజీవకుమార్, సలీం తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుంది'


శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. 8 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులను మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. శనివారం కాటేదాన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వ్యవస్థ లేకుండా అందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఎన్నికల్లో పొందుపరిచిన మెనిఫెస్టోలోని ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

సీబీఐటీలో కేన్సర్‌పై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

మణికొండ: సీబీఐటీ కళాశాలలో కేన్సర్ నివారణ, గుర్తింపు, చికిత్సను ప్రోత్సహించే క్రమంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'ఒక చేతి ముద్ర ఓ క్యాన్సర్ రోగి కోసం ఓ ప్రార్ధనతో సమానం' అనే నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టి వివిధ రంగులతో తమ చేతితో ముద్రను గోడలపై ముద్రించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధి ప్రమాదకరంగా మారిందని దాన్ని పూర్తి స్థాయిలో నివారించేందుకు మందులను త్వరగా కనుక్కోవాల్సిన అవసరం ఉందన్నారు. క్యాన్సర్ కారకాలను గుర్తించి వాటికి దూరంగా ఉంటే క్యాన్సర్ దరిచేరకుండా ఉండొచ్చన్నారు. ప్రపంచ క్యాన్సర్ డిక్లరేషన్‌పై అవగాహన పెంచే క్రమంలో మొక్కలను నాటారు. అధ్యాపకులు డాక్టర్ కె. జగన్నాథరావు, డాక్టర్ పీవీ నాగప్రపూర్ణ, మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ప్రసన్నరాణి, డాక్టర్ జీఎస్‌ఆర్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. స్వర్ణ భారత్ ట్రస్ట్, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఈ వైద్య శిబిరాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని వారు వివరించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరుకానున్నట్లు సమాచారం.

లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలి

రాజేంద్రనగర్: డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన కేసులు పరిష్కరించేందుకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా పట్టుబడిన కేసుల పెండింగ్ పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 2 నుంచి 11 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి రూ.2 వేలు, లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వారికి రూ.1000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఒరిజినల్ లైసెన్స్, ఆర్సీ, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలని పోలీసులు సూచించారు. మరింత సమాచారం కోసం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ ఫోన్ నెంబరు 7901115504 ను సంప్రదించాలని కోరారు.

పోస్టాఫీస్‌లో 'సుకన్య' అకౌంట్ మేళా

శంషాబాద్ రూరల్: పోస్టల్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జాతీయ స్థాయి స్టాంపుల ప్రదర్శనలో భాగంగా ఈ నెల 9,10 తేదీల్లో సుకన్య సమృద్ధి ఖాతా మేళా చేపడుతున్నట్లు జిల్లా తపాలా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంపత్‌రెడ్డి శనివారం ప్రకటించారు. ఈ ఖాతాలకు భారత ప్రభుత్వం 7.6 శాతం చక్రవడ్డీ అందిస్తోందన్నారు. ఖాతాలో జమైన మొత్తం సొమ్ము మీద ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని పోస్టాఫీసుల్లో కేవలం రూ.250తో ఖాతా తీసుకుని బాలికల మంచి భవిష్యత్‌కు తోడ్పాటును ఇవ్వాలని సూచించారు.

ఉందానగర్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని వినతి



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శంషాబాద్: ఉందానగర్ (శంషాబాద్) రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని బీజేపీ నేతలు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌జైన్‌కు విన్నవించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆయనకు స్వాగతం పలికిన అనంతరం వినతిపత్రం అందజేశారు. ఉందానగర్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు రైల్వేస్టేషన్ పనులు కూడా చేపట్టాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, నాయకులు భాస్కర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న కాటేదాన్ ప్రాంతంలో 40 ఏళ్లున్న మూగ వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రున్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సదరు వ్యక్తికి సంబంధించిన వివరాలు లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులెవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బంది, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు. ప్రమాదానికి కారణమైన వారికోసం గాలిస్తున్నామని కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుంట శిఖాన్ని పూడ్చివేస్తున్న వ్యక్తిపై కేసు

శంషాబాద్ రూరల్: కుంట శిఖం భూమిలో మట్టి నింపిన వ్యక్తిపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పెద్దగోల్కొండ శివారులోని ఈదులకుంట శిఖంలో స్థానికుడు రాత్రిపూట అక్రమంగా సర్వే నంబరు 129, 131లో ఈదుల కుంట వద్ద శుక్రవారం రాత్రి టిప్పర్‌లో మట్టితో కుంటను పూడ్చుతున్న క్రమంలో సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంజీవ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బీఆర్‌ఎస్ నాయకురాలు మృతి


పద్మజ వర్మ (ఫైల్)

మణికొండ: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళా ఉపాధ్యక్షురాలు పద్మజశర్మ (46) శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. చిత్రపురికాలనీలో నివసించే ఆమె గత కొంతకాలంగా ఆమె మెదడువాపుతో ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. కాగా రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన ఆమె శుక్రవారం అపస్మారక స్థితికి వెళ్లడంతో తిరిగి ఆసుపత్రిలో చేర్చారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతి పట్ల వివిధ పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఏజీవర్సిటీలో ప్రారంభమైన అంతర్ కళాశాలల క్రీడలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల క్రీడలు, లలితకళలు, సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. శనివారం ఈ క్రీడలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ కపోతాలను ఎగరేసి ప్రారంభించారు. వివిధ కళాశాలల విద్యార్థుల మార్చ్‌ఫస్ట్ నిర్వహించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడలు మానసిక వికాసానికి తోడ్పడతాయని విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు.

- అధునిక సమాజంలో ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని క్రీడలు ఆరోగ్య పరిరక్షణ, శారీరక దారుఢ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు.
- క్రీడాకారులు క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ప్రతి విద్యార్థి ఎదో ఒక క్రీడలో రాణించాలని సూచించారు.
- ఈ క్రీడల్లో మొత్తం 9 కళాశాలలకు చెందిన 570 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వర్సిటీ అధికారులు సత్యనారాయణ, డాక్టర్ సీమ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, అనిత, రత్నకుమార్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.


మార్చ్‌ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు


క్రీడాకారులతో వర్సిటీ అధికారులు

ప్రారంభమైన మల్లన్న ఉత్సవాలు

మణికొండ: ప్రతి ఏటా నిర్వహించే మణికొండ మల్లన్న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం తొలిరోజున గంగనీటిని తెచ్చి ఉత్సవాలను ప్రారంభించగా.. రాత్రి మల్లన్న ఒగ్గు కథను చెప్పారు. దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జైహింద్‌రావు, అధ్యక్షుడు ముత్యాలు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పెద్ద కురుమ బిక్షపతి, చిన్న కురుమ నర్సింహ, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, కో-ఆప్షన్ సభ్యుడు జె.సిద్ధప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లన్న కల్యాణం...

ఉదయం 11.52 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకులు ప్రకటించారు. ఉదయం 9 గంటలకు కొట్నం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం, 2.30 గంటలకు అగ్నిగుండాలు, 3 గంటలకు సదర్‌పటం, సాయంత్రం 5గంటలకు ఎల్లమ్మ బోనాలు, రాత్రి 9గంటలకు మల్లన్న చరిత్ర ఒగ్గు కథలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


గంగనీటిని తీసుకొస్తున్న దృశ్యం

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి


విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించిన అతిథులు

మణికొండ: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, పాఠశాలలపై ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని త్రివేణి టాలెంట్ పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులతో పాటు ఇలాంటి విజ్ఞానాన్ని పెంపొందించాలని అప్పుడే వారిలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. మన దేశ సంస్కృతి, నాగరికత, ప్రపంచీకరణ ప్రతిబంబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేసిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాల పీఆర్‌ఓ సాయినరసింహారావు, సీవీసీ నటరాజ్, ఏసీఆర్‌ఓ నరేష్, ప్రిన్సిపాల్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లీలారెడ్డి, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

శ్రీరామనగరంలో సామూహిక పారాయణం


అభిషేక కార్యక్రమంలో చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: శ్రీరామనగరంలో సమతా కుంభ్ ఉత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక పారాయణం చేశారు. 18 ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. సాకేత రామచంద్రస్వామికి శేష వాహన సేవ, సాకేతవల్లీ అమ్మవారికి హంస వాహన సేవలు చేశారు. అరగంట సేపు భక్తులతో కలిసి జీయర్‌స్వామి ధ్యానం చేశారు. ఇక్కడ శ్రీరామచంద్రుడికి 18 రూపాల్లో తిరుమంజనం జరపడం ప్రత్యేకంగా ఉంటుందని స్వామి తెలిపారు.

గృహిణి ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం..

గృహిణి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని చినజీయర్‌స్వామి అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికాస తరంగిణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన చిన జీయర్‌స్వామి భక్తులకు ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి, శ్రీ అహోబిల జీయర్‌స్వామి, శ్రీ దేవనాథ జీయర్‌స్వామి, వికాస తరంగిణి అధ్యక్షుడు జగదీశ్వర్, ఏపీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనులు త్వరగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: ఇండోర్ స్టేడియం పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సూచించారు. శనివారం స్టేడియంలో జోనల్ కమిషనర్ అశోక్‌సామ్రాట్, ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేడియంలో అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పనులన్నింటినీ సత్వరమే పూర్తి చేయించాలన్నారు. మార్చి నెలలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇండోర్ స్టేడియం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఏఈ నరేందర్‌గౌడ్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

మూడు ట్రాక్టర్‌లు, ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

మణికొండ: ట్రాక్టర్‌లు, ద్విచక్ర వాహనాలను చోరీ చేసి తప్పించుకుని తిరుగుతున్న అంతర్రాష్ట్ర ముఠాను శంషాబాద్ సీసీఎస్, శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీసీపీ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అదనపు డీసీపీ సాధన రష్మీ పెరుమాల్, అదనపు డీసీపీ క్రైం నర్సింహ్మారెడ్డిలు వారి వివరాలను వెల్లడించారు.

- మహారాష్ట్ర, లాతూర్‌కు చెందిన ముజాహిద్ మహమ్మద్ సయ్యద్, అదే చిరునామాకు చెందిన జమీర్ దిలావర్‌షేక్, కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన జమేదార్‌శ్యామ్‌లు గ్యాంగ్‌గా ఏర్పడి అనేక నేరాలకు పాల్పడినట్టు సమాచారం. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగపురం గ్రామానికి చెందిన చాకలి పాండుకు చెందిన ట్రాక్టర్ (టీఎస్07యూసీ 9234)ను గతేడాది నవంబర్ 26 న దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో లాతూర్‌లో ట్రాక్టర్‌ను గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా మరిన్ని నేరాలను అంగీకరించారు. వారి నుంచి రూ. 35 లక్షల విలువచేసే మూడు ట్రాక్టర్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.
- నిందితులు ముగ్గురు గతంలో రేప్, దొంగతనాలు వంటి అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితాన్ని కూడా గడిపారన్నారు. వారిని అరెస్టు చేసేందుకు కృషి చేసిన శంషాబాద్ సీసీఎస్, శంకర్‌పల్లి స్టేషన్ పోలీసులను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. క్రైం ఏసీపీ శశాంక్ రెడ్డి, సీసీఎస్ శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.నర్సింహ, శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ మహేష్, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌లు పాల్గొన్నారు.